క్లుప్తంగా

నేడు పట్టణంలో 144 సెక్షన్

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో సోమవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ డి. రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం వారసంత రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పట్టణవాసులు, పరిసర ప్రాంత ప్రజలు గమనించాలని సూచించారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, శివుని, ఇస్లాపూర్, అప్పారావుపేట్, మలక్‌జాం ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తలనీలాలు, తులాభారంతో మొక్కులు తీర్చుకొని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఓటరు చీటీల పంపిణీ



బర్కత్‌పూర్‌లో పంపిణీ చేస్తున్న బీఎల్‌వో

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం బీఎల్‌వోలు ఓటర్లకు పోల్ స్లిప్(ఓటరు చీటీ)లను పంపిణీ చేశారు. కొందరికీ చీటీలు రాకపోవడంతో అధికారులకు ఫోన్ చేసి విన్నవిస్తున్నారు. పూరిస్థాయిలో చీటీలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

ధర్మారంలో భక్తుల పూజలు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. ఇతర మండలాల నుండి వచ్చిన భక్తులు అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్)లో ఆదివారం బీఆర్‌ఎస్ కార్యకర్త విజయ్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలియడంతో గ్రామానికి వెళ్లి పరామర్శించారు.

అడెల్లిలో భక్తుల సందడి



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అమ్మవారి దర్శన ప్రవేశం కల్పించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీఐ



రాచాపూర్‌లో పరిశీలిస్తున్న సీఐ నవీన్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్, కనకాపూర్, రాచాపూర్, పొట్టపెల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం సాయంత్రం సోన్ సీఐ నవీన్‌కుమార్ పరిశీలించారు. కేంద్రాల వద్ద ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలాగా ప్రజలు సహకరించాలని కోరారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండొద్దని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామంలో గాండ్ల భోజన్న అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రోజు మాదిరిగానే మేత కోసం వెళ్లగా ఓ చేనులో విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

నేడే ఎన్నికల సమరం

- ఇప్పటికే సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నతాధికారులు



సారంగపూర్: జామ్‌లో కేంద్రం వద్ద సిబ్బంది



కుంటాల: లింబా(కె) పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఈవీఎంలతోపాటు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. మండలంలోని ఆరు రూట్ల పరిధిలో 54 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. నాలుగు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేశారన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు.

కుంటాల: లోకసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల నోడల్ అధికారి ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని 23 పోలింగ్ కేంద్రాలను 3 రూట్లుగా విభజించి.. ముగ్గురు ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో 115 సిబ్బంది పాల్గొంటున్నారని అన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఆదివారం మధ్యాహ్నం సిబ్బంది చేరుకున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, కన్కపూర్, అబ్దుల్లాపూర్, లోకేశ్వరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారి గణేశ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్డి, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారి వెంట సెక్టోరియల్ అధికారి రఘువంశీ, కార్యదర్శులు ఉన్నారు.



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో సిబ్బంది



ఖానాపూర్: తిమ్మాపూర్ పోలింగ్ కేంద్రం వద్ద..

దస్తురాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. మండలంలోని 12,795 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈదురుగాలులకు పలు కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగగా.. సిబ్బంది పునరుద్ధరించారు.

ఖానాపూర్: మండలవ్యాప్తంగా మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. పట్టణ పరిధిలో 17, గ్రామాల్లో 33 కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ఉట్నూర్ నుంచి ఈవీఎంలతో పాటు అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఇప్పటికే కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు సీసీ కెమెరాలను బిగించారు.



దస్తురాబాద్‌లో..



లోకేశ్వరం: పంచగుడి కేంద్రం వద్ద..

భైంసాలో సర్వం సిద్ధం..



మదీనా కాలనీలోని కేంద్రానికి వస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించారు. ఎండల నేపథ్యంలో ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్ కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్లు.. విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం కేంద్రం లోపల కూలర్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం లోపల, బయట సీసీ కెమెరాలు బిగించారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు ఉద్యోగులు, బందోబస్తు నిర్వహించే పోలీసు బలగాలు, సిబ్బంది చేరుకున్నారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. ఉదయం ఏడు నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది.

ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రం



కొబ్బరిమట్టలతో స్వాగత తోరణం



తాటికమ్మలు, మామిడి తోరణాలతో పందిరి

కడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆదర్శ మహిళా పోలింగ్ స్టేషన్ ఆకట్టుకుంది. కొబ్బరి మట్టలతో స్వాగత తోరణం, పోలింగ్ కేంద్రం ముందు తాటి కమ్మలతో పందిరి ఏర్పాటు చేశారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి బెలూన్లతో వేడుకను తలపించేలా తీర్చిదిద్దారు.

వైభవంగా వార్షికోత్సవం



పల్లకిసేవలో భక్తులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పుణ్యాహవచనం, అంకురార్పణం, గణపతి పూజ, అవాహిత దేవత హోమం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. అనంతరం పల్లకిసేవ నిర్వహించి సాయంత్రం ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగించారు. స్థానిక పద్మశాలి సంఘం సభ్యులతోపాటు వివిధ ప్రాంతాల వారు వచ్చి పూజలు చేశారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, భూపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు బిట్లింగ్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ పూజలు చేశారు.



ముస్తాబైన ఆలయం

గ్రామాల్లో వాహనాల తనిఖీ

నర్సాపూర్(జి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు సరఫరాను అరికట్టేందుకు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై హన్మాండ్లు మాట్లాడుతూ అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేందర్, చౌహాన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం, డబ్బు సరఫరా కాకుండా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఖానాపూర్, తర్లపాడ్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో, బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌ఎస్‌టీ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.



తనిఖీ చేస్తున్న ఎస్సై హన్మాండ్లు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కడెం: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నబెల్లాల్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అకాల వర్షాలు ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. తప్ప, తాలు పేరిట కోతలు విధిస్తే రైతులకు మద్దతుగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, జక్కుల సత్తెన్న, తోట రాజేశ్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ

గండిపోచమ్మ ఆలయం ముస్తాబు

- నేడు ఆలయ 17వ వార్షికోత్సవం

కడెం: మండలంలోని ఉడుంపూర్ గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువుదీరిన గండి పోచమ్మ ఆలయం 17వ వార్షికోత్సవ వేడుకలను ముస్తాబైంది. సోమవారం ఉదయం అభిషేకం, ధ్వజారోహణం, హోమం, తీర్థప్రసాదం, అన్నదానం, రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని ఆలయ పూజారి రామగిరి కిష్టయ్య పేర్కొన్నారు. మండలం నుంచి ఉట్నూర్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ ఆలయానికి ఉమ్మడి జిల్లా నుంచే కాక హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఈ ఆలయం వద్ద ఆగి పోచమ్మతల్లిని దర్శించుకుంటారు. కోరిన కోరికలు తీరుస్తుందనే విశ్వాసంతో ప్రతి ఆదివారం, మంగళ, గురువారాలు ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.



గర్భగుడిలో పోచమ్మతల్లి

రేషన్‌బియ్యం కోసం నిరసన

- డీలర్ పక్కదారి పట్టిస్తున్నాడంటున్న గిరిజనులు
- దుకాణం ఎదుట బైఠాయింపు
- ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ



రేషన్ దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు

పెంబి: ప్రభుత్వం ఉచితంగా అందించే రేషన్ బియ్యం తమకు పూర్తిస్థాయిలో అందడం లేదని పెంబి మండలంలోని యాపలగూడ, రాంనగర్, జంగుగూడ, షెట్‌పల్లి గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు బియ్యం చేయని రేషన్ డీలర్‌పై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యాపలగూడ, రాంనగర్, జంగుగూడ, షెట్‌పల్లి గ్రామాల గిరిజనులు.. షెట్‌పల్లిలోని రేషన్ దుకాణం వద్ద బియ్యం తెచ్చుకుంటారు. ఆదివారం ఆయా గ్రామాల ప్రజలు(సుమారు 100 మంది) రేషన్ దుకాణం వద్దకు వెళ్లగా డీలర్ మల్లేశ్ బియ్యం అయిపోయాయని సమాధానమిచ్చాడు. దీంతో గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతంలోనూ బయోమెట్రిక్ తీసుకొని బియ్యం పంపిణీ చేయలేదని గిరిజనులు ఆరోపించారు. ప్రతి నెలా రెండు, మూడు రోజులే పంపిణీ చేస్తాడని.. మరుసటి రోజు వెళితే బియ్యం అయిపోయానని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతాడని వాపోయారు. మాకు న్యాయంగా రావాల్సిన బియ్యాన్ని రేషన్ డీలర్ మల్లేశ్ పక్కదారి పట్టించి అమ్ముకుంటున్నాడని ఆరోపించారు.

ఫోన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజనులు ఫోన్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు ఆదివారం మధ్యాహ్నం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పంచపుల షెట్‌పల్లిలోని రేషన్ దుకాణానికి వచ్చి విచారణ జరిపారు. డీలర్ అవకతవకలు జరిపినట్లు తెలిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.



విచారణ జరుపుతున్న డీటీ పంచపుల

అకాల వర్షం.. అన్నదాతలకు నష్టం

ఖానాపూర్: మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న అకాల వర్షానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల అనేక మంది వరిపొలాలు కోయాల్సి ఉంది. కొందరు రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెట్టారు. ఇప్పటికే శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. పలువురు రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ కుప్పల కిందకు నీరు వెళ్తుండటంతో ధాన్యం కొట్టుకుపోతుంది. కేంద్రాల్లో సరిపడ టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌తోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురువడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పంట తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని లింబా(కె), ఓలా, కల్లూర్, అందాకూర్, కుంటాల గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులు వీచాయి. కల్లాలఎదుట ఉన్న ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లను కప్పి ఉంచారు.



ఖానాపూర్ మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రం వద్ద తడుస్తున్న ధాన్యం



లింబా(కె)లో టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



మల్లాపూర్‌లో తడుస్తున్న నువ్వు పంట

ముగిసిన సప్తాహం

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకి ఊరేగించారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. చివరగా కాల దహీ హండీ చేపట్టి, అన్నదానం నిర్వహించారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఇంద్రవెల్లి: ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899